

వేధిస్తున్న కోచ్‌ల కొరత

పాలమూరులోని ఇండోర్ స్టేడియాల్లో కోచ్‌లు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

వివరాలు 8లో ▸



వైభవంగా శేషవాహనసేవ

మన్యంకొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శేషవాహన సేవ నిర్వహించారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.5/17.3

మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది. చలి తీవ్రత తగ్గుముఖం పట్టింది. ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వేరుశనగ నూనె తయారీ పరిశ్రమ పరిశీలన



వనపర్తి రూరల్: మండలంలోని దత్తాయిపల్లి శివారులో గత ప్రభుత్వం మండల మహిళా సమాఖ్య (ఐకేపీ) ఆధ్వర్యంలో వేరుశనగ నూనె పరిశ్రమను ఏర్పాటుచేసింది. నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ జిల్లా డీఏఓ చంద్రశేఖర్, ఏడీ పూర్ణచంద్రారెడ్డి, ఏఓ నరేశ్, ఏఈఓ రత్నరావు శనివారం గ్రామానికి చేరుకొని పరిశ్రమను పరిశీలించారు. వనపర్తి డీపీఎం అరుణ మిషనరీ, పరిశ్రమ నిర్మాణ వ్యయాన్ని వారికి వివరించారు. డీఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జిల్లాలో పరిశ్రమ ఏర్పాటుకుగాను కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటన్న, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

వనపర్తి టౌన్: వనపర్తి ఆర్టీసీ డిపో పరిధిలోని వనపర్తి, కొత్తకోట, ఆత్మకూర్, **పెబ్బేరు బస్‌స్టేషన్లలో** ఖాళీ స్థలాలు, **నిర్మాణంలో ఉన్న,** నిర్మించిన దుకాణాలను **అద్దె ప్రాతిపదికన** కేటాయించేందుకు దరఖా**స్తులు ఆహ్వానిస్తున్నట్లు** డిపో మేనేజర్ వేణుగోపాల్ **శనివారం ఒక ప్రక**టనలో తెలిపారు. దరఖా**స్తుల సమర్పణకు** మార్చి 3 వరకు గడు**వు ఉందని, డిపో** కార్యాలయంలో తగిన రుసు**ం చెల్లించి టెండర్** ఫారాలు పొందాలన్నారు. **బహిరంగ వేలంలో** దుకాణాల కేటాయింపు **ఉంటుందని పేర్కొ**న్నారు. పూర్తి వివరాలకు **సెల్‌ఫోన్ నంబర్లు** 99592 26289, 94940 **19474, 73828** 29092 సంప్రదించాలన్నారు.

రామన్‌పాడులో 1,021 అడుగులు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో శనివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా నీటి సరఫరా లేదని.. ఎన్టీఆర్ కాల్వకు 24 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 121, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

కొనసాగుతున్న రాజావళి దర్గా ఉర్సు



అమరచింత: పట్టణంలోని సయ్యద్‌షా రాజావళి దర్గా ఉర్సు వైభవంగా కొనసాగుతోంది. శనివారం జరిగిన తాజే చిరాక్ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు మాలీజాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉర్సుకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర, మహిమ గల రాజావళి దర్గాను ఎన్నో సందర్భాల్లో దర్శించుకున్నానని తెలిపారు. తాగునీటి వసతి కల్పనకు దర్గా ఆవరణలో బోరును వేయిస్తానని హామీ ఇచ్చారు. దర్గా అభివృద్ధికి తనవంతు సాయం అందించేందుకు ముందుంటానని వివరించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, డీసీసీ ప్రధానకార్యదర్శి అయ్యూబ్‌ఖాన్, అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, తిరుమలేష్, పోసిరిగారి విష్ణు, మహంకాళి విష్ణు, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

డీఎస్సీ 2008 అభ్యర్థులకు ఉద్యోగాలు

- ఫలించిన 17 ఏళ్ల నిరీక్షణ
- హైకోర్టు ఉత్తర్వులతో పోస్టింగులు
- కాంట్రాక్టు ఎస్జీటీలుగా అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 182 మందికి న్యాయం

నారాయణపేట/మద్దూర్: డీఎస్సీ– 2008 నష్టపోయిన బీఈడీ అభ్యర్థులకు కాంట్రాక్టు విధానంలో ఎస్జీటీలుగా వారం రోజుల్లోగా నియామకాలు పూర్తి చేయాలని హైకోర్టు తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని బాధిత అభ్యర్థుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నోటిఫికేషన్ అనంతరం తీసుకున్న నిర్ణయం మేరకు 30 శాతం పోస్టులు ప్రత్యేకంగా డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. మెరిట్ జాబితాలో ఉన్నా.. ఉద్యోగాలు రాకపోవడంతో కోర్టుల చుట్టూ తిరుగుతూ వస్తున్నారు. 17 ఏళ్ల న్యాయ పోరాటం.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వీరందరికీ మినిమం టైం స్కేల్ వర్తింపజేస్తూ కాంట్రాక్టు విధానంలో నియమించనున్నారు. అయితే వీరందరికీ సాధ్యమైనంత త్వరగా పోస్టింగ్ ఇవ్వాలని గతంలోనే హైకోర్టు స్పష్టం చేసినా వివిధ కారణాలతో జాప్యం జరుగుతూ వచ్చింది.

సర్టిఫికెట్ల పరిశీలన

ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలన ఉమ్మడి జిల్లాల వారీగా పూర్తయింది. ఈ పరిశీలన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 5 వరకు కొనసాగింది. తాజాగా కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నియామక ఉత్తర్వులను వారం రోజుల్లో ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో బాధిత అభ్యర్థులు కాంట్రాక్టు ఎస్జీటీలుగా నియామకం కానున్నారు. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా 182 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. ఉమ్మడి జిల్లాల వారీగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయినప్పటికీ నూతన జిల్లాల వారీగానే పోస్టింగ్ ఇవ్వాలని అభ్యర్థులు కోరుతుండగా.. ఖాళీలను బట్టీ పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది.

జిల్లాల వారీగా అభ్యర్థుల సంఖ్య..

జోగుళాంబ గద్వాల	నారాయణపేట	వనపర్తి	నాగర్‌కర్నూల్	మహబూబ్‌నగర్
50	50	40	32	10



నారాయణపేటలో ఎంపికైన అభ్యర్థికి ఆర్డర్ కాపీ అందజేస్తున్న డీఈఓ గోవిందరాజులు



న్యాయ పోరాటంతోనే..



ఎన్నో సంవత్సరాల పోరాటంతో ఫలించిన అద్భుత క్షణం ఇది. 2008లో డీఎస్సీ రోస్టర్‌లో మా పేర్లు ఉన్నా కొన్ని కారణాలతో ఉద్యోగం రాలేదు. 28 జీఓ ప్రకారం మా ఉద్యోగాలు మాకు రావాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. ఎట్టకేలకు అనుకూలంగా తీర్పు రావడం సంతోషంగా ఉంది.

– బాలస్వామి, నాగర్‌కర్నూల్

సర్వీస్ కల్పించాలి..



17 ఏళ్ల నిరీక్షణ తర్వాత ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం సంతోషంగా ఉంది. అయితే మేమంతా 17 ఏళ్ల సర్వీస్ కోల్పోయాం. ఇప్పటికి మాకు అనుకూలంగా తీర్పులు వచ్చాయి. ఉద్యోగం ఇస్తూ సర్వీస్, ఏరియర్స్ కల్పిస్తూ.. రెగ్యులర్ చేస్తే బాగుంటుంది.

– విజయ్‌కుమార్, మద్దూరు

నష్టపోయాం..



డీఎస్సీ– 2008లో వెలువడిన నోటిఫికేషన్ ద్వారా పోటీ పరీక్షల్లో ఎంపికై కౌన్సెలింగ్ సమయంలో ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల కారణంగా చాలా నష్టపోయాం. అప్పటి నుంచి కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం హర్షణీయం.

– బుగ్గప్ప, మద్దూరు

సంతోషంగా ఉంది..



17 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత మాకు ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. గత 17 ఏళ్లుగా వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగించాను. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మాకు అన్యాయం జరిగి.. మళ్లీ అదే ప్రభుత్వంలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

– రవిప్రకాష్, నారాయణపేట

కొత్త జిల్లాల వారీగా..



ఇప్పటికైనా ఉద్యోగం రావడం చాలా ఆనందంగా ఉంది. కానీ, మమ్మల్ని మా స్థానికత ఆధారంగా కొత్త జిల్లాల వారీగా నియమిస్తే బాగుండేది. అలాగే ఎంటీఎస్ విధానంలో జీతాలు ఇవ్వకుండా రెగ్యులర్ టీచర్ల మాదిరిగానే చెల్లించేలా చూడాలి.

– అరుణ, వనపర్తి

'డిజిటల్' కష్టాలు!

పనిచేయని ట్యాబ్‌లు.. మరమ్మతుకు గురవుతున్న స్మార్ట్‌ఫోన్లు



కొత్తకోటలో పంట వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ (ఫైల్)

- పంట వివరాల నమోదులో ఏఈఓల అవస్థలు
- జిల్లాలో 255 గ్రామాలు.. 71 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు
- రోజు 20 ఎకరాలకు మించి నమోదు కాని వైనం
- సహాయకులు లేక ఇబ్బందులు పడుతున్న మహిళా ఉద్యోగులు

అమరచింత: యాసంగి సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదేళ్ల కిందట ఇచ్చిన ట్యాబ్‌లు మరమ్మతుకు గురికావడంతో సొంత స్మార్ట్‌ఫోన్లలో వివరాలు నమోదు చేస్తుండటంతో అవి కూడా పాడైపోతున్నాయని ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రతి సర్వే పనుల్లో తమను వినియోగించుకుంటున్నారని.. తాము శాఖాపరంగా చేసే సర్వేకు మాత్రం ఇతర సిబ్బందిని సహాయకులుగా ఇవ్వకపోవడంతో పంటల నమోదు ప్రక్రియ భారంగా మారిందని ఏఈఓలు వాపోతున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ వారం కిందట ఏడీఏకు వినతిపత్రం కూడా అందించామని చెప్పారు. జిల్లాలోని 14 మండలాల్లో ఉన్న 255 గ్రామపంచాయతీల్లో 71 మంది ఏఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఫిబ్రవరి 2 నుంచి పంట వివరాల నమోదు చేపడుతున్నామని.. సహాయకులు లేకపోవడంతో ఏయే సర్వేనంబర్లలో ఏయే పంటలు సాగు చేశారనే వివరాలు పక్కపొలం రైతులు చెప్పలేని స్థితిలో సర్వే ఎలా చేస్తామంటూ ప్రశ్నిస్తున్నారు.

ముందస్తు సమాచారం ఇచ్చినా..

రెవెన్యూ అధికారుల మ్యాప్ ఆధారంగా వ్యవసాయ విస్తరణ అధికారులు డిజిటల్ సర్వే చేపడుతున్నారు. గత ప్రభుత్వం రైతుబీమా పథకం అమలు చేయడంతో పట్టాదారు కుటుంబంలోని అందరి పేరిట కొంత కొంత భూమి పట్టా చేశారు. దీంతో అదే సర్వేనంబర్‌ను విభజించి నంబర్లు కేటాయించడంతో ఏ పొలం ఏ రైతు పేరున ఉందన్న విషయం అర్థంగాక తలలు పట్టుకుంటున్నారు. పంట సర్వేకు వస్తున్నామని ముందస్తుగా రైతులకు సమాచారం ఇచ్చినా.. పొలాల వద్ద రైతులు అందుబాటులో లేకపోవడంతో వివరాల నమోదులో జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంటల సర్వే ప్రక్రియ రాగానే రెవెన్యూ సిబ్బందిని సహాయకులుగా వెంట పంపడంతో ఎవరి పొలం ఎక్కడుంది.. ఏ రైతు ఏ పంట వేశారనే వివరాలు వెంటనే తెలుసుకోవడం, ఆన్‌లైన్‌లో నమోదు చేయడం చకచకా జరిగిపోయేవని.. ప్రస్తుతం కొనసాగుతున్న సర్వే ఆరు నెలలైనా పూర్తి చేయలేని పరిస్థితి ఉందని కొందరు ఏఈఓలు చెబుతున్నారు.

ఫోన్లు పాడవుతున్నాయి..



పంట వివరాల నమోదుకు ఐదేళ్ల కిందట వ్యవసాయశాఖ ఇచ్చిన ట్యాబ్‌లు ప్రస్తుతం పనిచేయడం లేదు. దీంతో వ్యక్తిగత స్మార్ట్‌ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నమోదు చేస్తున్నాం. ఫొటో క్యాప్చర్, డాటా ఎంట్రీ సమయంలో ఫోన్లు వేడెక్కి పాడవుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లలోని వ్యక్తిగత సమాచారం సైతం బయటి వ్యక్తులు చేతుల్లోకి వెళ్తుందనే భయం వెంటాడుతోంది.

– సూదిరెడ్డి రవీందర్‌రెడ్డి, ఏఈఓ, కొత్తకోట

రక్షణ కరువు..



రెవెన్యూ సహాయకులు లేకపోవడంతో మహిళా ఏఈఓలు ఒంటరిగా వెళ్లి పంట వివరాలు నమోదు చేయడం కష్టంగా ఉంది. గ్రామంలో భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి.. ఏయే సర్వేనంబర్లలో ఏయే పంటలు సాగు చేశారనే వివరాలు తెలుసుకోవడానికే సమయం సరిపోతుంది. రోజువారీగా 20 ఎకరాల వివరాలు సైతం నమోదు చేయలేకపోతున్నాం.

– హరిత, ఏఈఓ, నాగల్‌కడ్మూర్

సరైన వివరాలు లేక..



రెవెన్యూ అధికారులు జారీ చేసిన పట్టాదారు పాసు పుస్తకాల ప్రకారం గ్రామాలకు వెళ్లి పంట వివరాల నమోదు చేయడంలో ఇబ్బందులు కలుగుతున్నాయి. పాత ట్యాబ్‌లతో రోజువారీగా పది ఎకరాల పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేని పరిస్థితి ఉంది. జిల్లా అధికారులు స్పందించి కొత్త ట్యాబ్‌లు, సహాయకులను ఇవ్వాలి.

– జయశ్రీ, ఏఈఓ, పెబ్బేరు క్లస్టర్

ఉన్నతాధికారులకు నివేదించాం..



పంట వివరాల నమోదులో కలుగుతున్న ఇబ్బందులను డివిజన్ పరిధిలోని ఏఈఓలు విన్నవించారు. సమస్యను జిల్లా వ్యవసాయ అధికారికి నివేదించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

– దామోదర్, ఏడీఏ

యూరియా నిల్వలు పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పాన్‌గల్: స్థానిక సింగిల్‌విండో కార్యా**లయంలో యూరియా** కోసం **రైతులు పడుతున్న** ఇబ్బందు**లను వివరిస్తూ** 'రైతులకు **యూరియా తిప్పలు**' శీర్షికన శని**వారం 'సాక్షి'లో** కథనం ప్రచు**రితమైంది. ఇందుకు** స్పందించిన **ఏడీఏ చంద్రశేఖర్,** ఏఓ రాజవర్ధన్ **రెడ్డి కార్యాలయాన్ని** సందర్శించి యూరియా **నిల్వలు, సరఫరాను** పరిశీలించారు. ఈ సం**దర్భంగా వారు** మాట్లాడుతూ.. కార్యాలయంలో సీజన్‌కు సరిపడా 90 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట సింగిల్‌విండో సీఈఓ భాస్కర్‌గౌడ్, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ చంద్రశేఖర్ తదితరులు

సంత్ సేవాలాల్ మార్గం ఆచరణీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గం ఆచరణీయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నాగవరం శివారులోని సేవాలాల్ భవన్‌లో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి గిరిజనులు తరలిరాగా.. మహిళలు తమ సాంప్రదాయ దుస్తులతో వేడుకకు హాజరయ్యారు. సేవాలాల్ మహరాజ్, మేరమయాడి దేవత మహాభోగ్ (హోమం)లో ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి, లంబాడి పూజారులు రాజ్‌పవార్, బిక్షానాయక్ పాల్గొని నెయ్యి, కడావ్ ప్రసాదం వేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సేవాలాల్ అందరికీ ఆదర్శప్రాయుడని.. ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఇందుకుగాను నియోజకవర్గానికి రూ.2.68 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. సేవాలాల్ ఆలయం, సేవాలాల్ భవన్‌లో వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ.. దౌర్జన్యానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారితో పోరాటం చేసిన యోధుడు సేవాలాల్ అన్నారు. దొంగతనాలు చేయొద్దు.. మాంసాహారం తినొద్దని బోధించారని గుర్తు చేశారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని.. ప్రతి బంజారా చదువుకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి ఉన్నతవిద్య అభ్యసించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాకు ఎస్టీ గురుకుల పాఠశాల తీసుకొచ్చేందుకు కృషి చేశానన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి పి.సీతారాంనాయక్, గిరిజన అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి, శంకర్‌నాయక్, జాత్రూనాయక్, వాల్యానాయక్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, గిరిజన సేవాసంఘం అధ్యక్షుడు చంద్రూనాయక్, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అర్జున్‌నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హన్మంత్‌నాయక్, వి.రాధాకృష్ణ, సూర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న కో–ఆర్డినేటర్ యుగంధర్

వనపర్తి విద్యావిభాగం: పదోతరగతి విద్యార్థులు ఇంటి దగ్గర చదువుకునేలా తల్లిదండ్రులు అనువైన వాతావరణం, సౌకర్యాలు కల్పించాలని జిల్లా విద్యాశాఖ కమిటీ మొబిలైజేషన్ కో–ఆర్డినేటర్ యుగంధర్ కోరారు. శనివారం ఆయన మండలంలోని రాజపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్తకోటలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశాలకు ఆయన హాజరయ్యారు. 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యార్థుల ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలు రోజు ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చూడాలని కోరారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున పౌష్టికాహారం అందించి వారు ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతి విద్యార్థి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలకవర్గాలకే 'సహకారం'

- పీఏసీఎస్, డీసీసీబీ చైర్మన్ల పదవీకాలం పొడిగింపు
- ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- డీసీఎంఎస్‌కు సంబంధించి వెలువడని నిర్ణయం

అచ్చంపేట: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పాక్స్) పాలకవర్గాల పదవీకాలాన్ని ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి వెలువడిన ఉత్తర్వులను ఆయా జిల్లాల సహకార శాఖ అధికారులు అందుకొని పీఏసీఎస్‌లకు పంపించారు. ఎన్నికల ప్రక్రియకు ఆరు నెలల ముందే కసరత్తు మొదలుపెట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు ఆ ఊసేలేదు. దీంతో ప్రత్యేకాధికారుల పాలనా.. ప్రస్తుతం పాలకవర్గ పదవీకాలాన్ని పొడిగిస్తారా అన్న సందేహాలకు తాజా ఉత్తర్వులతో తెరపడింది. జిల్లాలోని 87 సొసైటీల పాలకవర్గాలు మరో ఆరు నెలలపాటు కొనసాగనున్నాయి. డీసీసీబీ పాలకవర్గ పదవీకాలాన్ని కూడా పొడిగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే డీసీఎంఎస్‌కు సంబంధించి అంశం ఉత్తర్వుల్లో లేకపోవడం గమనార్హం. డీసీసీబీ, డీసీఎంఎస్ పాలకవర్గాలకు మరో పది రోజుల సమయం ఉండటంతో ఈలోగా డీసీఎంఎస్ పాలకవర్గ పదవీకాలం పొడిగింపు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.



ఉప్పునుంతలలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

హర్షాతిరేకాలు..

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షుల పదవీకాలం శనివారంతో ముగిసింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ (డీసీఎంఎస్) పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 20తో పూర్తవుతుంది. ప్రభుత్వం తాజా నిర్ణయంతో డీసీసీబీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, డీసీఎంఎస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, సహకార సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలోనూ పొడిగింపు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలోనూ 2018 ఫిబ్రవరి 4న పాలకవర్గాల పదవీకాలం ముగియగా ఆరు నెలల చొప్పున రెండుసార్లు పర్సన్ ఇన్‌చార్జ్‌ల పదవీకాలాన్ని పొడిగించారు. 2020 ఫిబ్రవరి 15న ఎన్నికలు నిర్వహించారు. అంతకు ముందు కాంగ్రెస్ హయాంలోనూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు రెండేళ్లు, టీడీపీ హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు మూడేళ్లపాటు పొడిగించారు. పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమిస్తే కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పాలకవర్గాల పదవీకాలాన్ని పొడిగించింది.

సీఎంకు కృతజ్ఞతలు



పీఏసీఎస్ పాలకవర్గాల కాలపరిమితి మరో ఆరు నెలలు పొడిగించేందుకు ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. మా విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొని పెంచిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను రైతులకు మరింత చేరువ చేసేందుకు సహకార వ్యవస్థను బలోపేతం చేస్తాం. – విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

భార్యతో గొడవపడి.. భర్త ఆత్మహత్య

శాంతినగర్: భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ బాషా కథనం మేరకు.. కర్నూలు జిల్లా ఈ–తాండ్రపాడుకు చెందిన మారెన్న (35), అతడి భార్య వసంత వివిధ గ్రామాల్లో జరిగే ఉత్సవాల్లో భిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వారు. ఇటీవల జరిగిన రాజోళి పెద్ద దేవర ఉత్సవాల్లో భిక్షాటనకు వచ్చారు. శనివారం శాంతినగర్‌కు చేరుకున్న దంపతులు భిక్షాటన చేయగా వచ్చిన డబ్బుల విషయంలో గొడవపడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన మారెన్న రవీంద్ర పాఠశాల ఆవరణలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


సాడమ్మ (ఫైల్)

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండకు చెందిన ధన్వాడ సాడమ్మ (45) నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సాడమ్మ బుధవారం ఇంట్లోనే పురుగుమందు తాగింది. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందగా.. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వివరించారు.

పాముకాటుతో మరొకరు..

గద్వాల క్రైం: పాముకాటుకు గురైన వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. గద్వాల మండలం బీరోలు గ్రామానికి చెందిన బీచుపల్లి(47)శనివారం ఉదయం కృష్ణనదిలో చేపల వేటకు బయలు దేరాడు. అయితే మార్గం మధ్యలో గుర్తు తెలియని పాము ఎడమ కాలుపై కాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించిగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ సంఘటనపై కుమారుడు నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'డ్రగ్స్‌తో కుటుంబాలు చితికిపోతున్నాయి'

పాలమూరు: ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాలు వాడకం వల్ల ఎన్నో కుటుంబాలు చితికిపోతున్నాయని జిల్లా నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.భావన అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం ప్రత్యేక బ్యాంకు లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర మూడు బ్యాంకు కేసులను పరిష్కరించి.. బాధితులకు చెక్కులు అందించారు. అలాగే మండలంలోని రామచంద్రాపూర్‌లో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించగా.. న్యాయమూర్తి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి టీనేజర్స్ అలవాటుపడి జీవితాలను ఇబ్బందులకు గురిచేసుకుంటున్నారని తెలిపారు. బాలల హక్కులు, బాధ్యతల గురించి పాఠశాలలో విద్యార్థులకు వివరించారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు


ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ మొగులయ్య

అలంపూర్ రూరల్: తుంగభద్ర నది, ఇతర వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా చేయకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు, ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ మొగులయ్య అన్నారు. అలంపూర్ ఎస్‌ఐ వెంకటస్వామితో కలిసి శనివారం తుంగభద్ర నదీతీరంలో ఇసుక రీచ్‌లు, సీజ్ చేసిన ఇసుక, ఇసుక క్వారీలను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ఇసుక క్వారీలపై నిఘా ఏర్పాటు చేశామని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని, ఎక్కడైన అనుమతి లేకుండా ఇసుక తవ్వినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశించిన ప్రాంతంలో రాయల్టీ రుసుము చెల్లించి ఇసుక తవ్వకాలు చేపట్టాలని, ఇసుక అక్రమ రవాణా పూర్తి స్థాయిలో నిర్మూలించడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నామని అన్నారు. ఇదిలాఉండగా, అలంపూర్ మండలంలోని కోనేరు గ్రామానికి చెందిన బోయ వెంకటరమణ ఎలాంటి అనుమతులు లేకుండా శనివారం ట్రాక్టర్‌లో తుంగభద్రనది నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు వారు తెలిపారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేధిస్తున్న కోచ్‌ల కొరత

వసతులున్నా సాగని శిక్షణ



మహబూబ్‌నగర్ పట్టణంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

- జిల్లాలో నాలుగు ఇండోర్ స్టేడియాలు
- కోట్లాది రూపాయలతో నిర్మాణాలు
- అధునాతన హంగులతో మల్టీపర్పస్ స్టేడియం
- నిరాశలో జిల్లా క్రీడాకారులు


పోతులమడుగులోని మినీ ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలో నాలుగు ఇండోర్ స్టేడియాలు ఉన్నా కోచ్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇండోర్ గేమ్‌ల్లో క్రీడాకారులు ప్రతిభచాటాలనే ఉద్దేశంతో జిల్లాలో ఇండోర్ స్టేడియంలు నిర్మించారు. కోట్లాది నిధులతో మహబూబ్‌నగర్ పట్టణంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో మూడు మినీ స్టేడియంలను ఏర్పాటు చేశారు. కోట్లాది రూపాయల నిధులతో ఇండోర్ స్టేడియంలు నిర్మించినా కోచ్‌లు లేకపోవడంతో ఔత్సాహిక క్రీడాకారులు శిక్షణకు దూరమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాకే తలమానికం ..

జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో అధునాతమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను నిర్మించారు. దాదాపు రూ.7.79కోట్ల నిధులతో అధునాతనమైన క్రీడా సౌకర్యాలతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటుచేశారు. ఉమ్మడి జిల్లాలోనే తలమానికంగా పాలమూరులో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం అందుబాటులోకి తెచ్చారు. ఇండోర్ స్టేడియంలో రెండు ఫ్లోర్‌లలో టేబుల్ టెన్నిస్ హాల్, బాక్సింగ్ హాల్‌తోపాటు స్టోర్ రూంలు, క్రీడాకారుల వసతి గదులను ఏర్పాటుచేశారు. ఇండోర్ స్టేడియంలో లోపల క్రీడాపోటీలను తిలకించడానికి రెండు వైపుల గ్యాలరీలు ఏర్పాటు చేసి సీట్లు అమర్చారు. స్టేడియం లోపల ఉడెన్ కోర్టులో ఆరు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటుచేశారు. జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాటోర్నీలకు వేదికగా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిలుస్తోంది. ఫాస్ట్–5 జాతీయస్థాయి సీనియర్ నేషనల్ నెట్ బాల్. ఇటీవలే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్‌తోపాటు సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ, నెట్‌బాల్ పోటీలు నిర్వహించారు.

మూడు ఇండోర్ స్టేడియంలు...

జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ కళాశాల మైదానంలో రూ.2.65కోట్లతో కొత్తగా మినీ స్టేడియం నిర్మాణం చేపట్టారు. చిన్నచింతకుంట మండలం అల్లీపూర్‌లో రూ.1.59కోట్లతో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. భూత్పూర్ మండలం పోతులమడుగు సమీపంలో రూ.2.65కోట్లతో మినీ స్టేడియం ఏర్పాటు కాగా ఇటీవలే అందుబాటులోకి వచ్చింది.

ప్రతిపాదనలు పంపాం



ఇండోర్ స్టేడియాల్లో కోచ్‌ల నియామకం కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో రానున్న నూతన క్రీడాపాలసీతో ఔత్సాహిక క్రీడాకారులకు ఎంతో మేలు జరగనుంది. స్టేడియంల్లో కోచ్‌ల నియామకం జరిగే అవకాశం ఉంది. క్రీడాశిక్షణతో నైపుణ్యంగల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. – ఎస్.శ్రీనివాస్, జిల్లా యువజన, క్రీడల అధికారి, మహబూబ్‌నగర్

టేబుల్ టెన్నిస్ కోచ్‌ను నియమించాలి



ప్రస్తుతం టేబుల్ టెన్నిస్ క్రీడకు ఎంతో క్రేజ్ ఉంది. జిల్లా కేంద్రంలో గతంలో రాష్ట్రస్థాయి ర్యాంకింగ్స్ టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించాం. ఈఆటపై ఆసక్తిఉన్న క్రీడాకారులు హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. జిల్లాలోని ఇండోర్ స్టేడియంల్లో టేబుల్ టెన్నిస్ కోచ్‌లను నియమిస్తే మరింత మంది జిల్లా క్రీడాకారులు ఈ ఆటలో నైపుణ్యాన్ని చాటుతారు. – సురేష్‌కుమార్, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, మహబూబ్‌నగర్

అన్నిచోట్ల ఇదే పరిస్థితి..

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ప్రస్తుతం ఒక బ్యాడ్మింటన్ కోచ్‌గా ఉండగా బాక్సింగ్, జూడో, టేబుల్‌టెన్నిస్ తదితర క్రీడలకు కోచ్‌లు లేరు. అల్లీపూర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఒక కబడ్డీ కోచ్ ఉండగా ఎంవీఎస్ కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో, పోతులమడుగు సమీపంలోని ఇండోర్ స్టేడియంలో కోచ్‌లు లేరు. ఇండోర్ స్టేడియంల్లో వెంటనే కోచ్‌ల నియామకం చేపట్టి క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలని క్రీడాభిమానులు, సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు. రానున్న వేసవి సెలవుల్లోపు కోచ్‌లు వస్తే వేలాదిమంది క్రీడాకారులకు శిక్షణ లభిస్తుందని, దీంతో నైపుణ్యంగల క్రీడాకారులను వెలుగులోకి తీసుకోవచ్చని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కోచ్‌ల భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సంత్ సేవాలాల్ కృషి మరువలేనిది

ఎంపీ డీకే అరుణ


గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ రూరల్: గిరిజనుల అభ్యున్నతికి సంత్ సేవాలాల్ మహరాజ్ చేసిన కృషి మరువలేనిదని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక బంజారా మహిళలు, యువతులతో కలిసి సంప్రదాయ నృత్యం చేశారు. బంజారాల పాటకు అనుగుణంగా గిరిజన మహిళలతో కలిసి స్టెప్పులేసి నూతనోత్సాహాన్ని నింపారు. అనంతరం మాట్లాడుతూ.. ఆధ్యాత్మికంగా, సామాజికంగా లంబాడీలు, బంజారాల బతుకుల్లో వెలుగులు నింపిన మహనీయుడు సేవాలాల్ అని కొనియాడారు. ఆయన చరిత్ర దేశవ్యాప్తంగా తెలిసేలా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని పార్లమెంట్‌లో ప్రస్తావించానని గుర్తుచేశారు. కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిశానని.. మున్ముందు హోంశాఖ మంత్రి, ప్రధాన మంత్రి దృష్టికి తీసుకెళ్తానని వివరించారు.

తేనెటీగల పెంపకంతో లాభాలు


సర్టిఫికెట్లు అందుకున్న రైతులతో శాస్త్రవేత్తలు

కొత్తకోట రూరల్: తేనెటీగల పెంపకంతో అధిక లాభాలు ఉంటాయని రాజేంద్రనగర్ కూరగాయల పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.అనిత కుమారి అన్నారు. పెద్దమందడి మండలం మోజర్ల సమీపంలోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉద్యాన కళాశాలలో తేనెటీగల పెంపకంపై ఆరు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ.. తేనెటీగల పెంపకంపై పూర్తిస్థాయి సాంకేతిక సమాచారం అందించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులకు మరింత అవగాహన కోసం తేనెటీగల నిర్వహణ పరిశ్రమలకు తీసుకెళ్తామని తెలిపారు. ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య మాట్లాడుతూ.. తేనెటీగల పెంపకం చిన్నా, సన్నకారు రైతులకు అదనపు ఆదాయాన్ని ఇచ్చే పరిశ్రమగా ఉంటుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తేనె ఎంత కాలం నిల్వ ఉన్నప్పటికీ నష్టాలు ఉండవన్నారు. ప్రత్యేకించి కూరగాయ పంటల్లో ఫలదీకరణాన్ని పెంపొందించడం ద్వారా పంటల ప్రొడక్టివిటీ పెంచడంలో ఎంతో ఊతమిస్తుందన్నారు. ప్రభుత్వ విభాగాలతో పాటు అనేక సంస్థలు తేనెటీగల పెంపకం కోసం ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన శిక్షకురాలు డా.షహనాజ్ పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్లే సబ్–రిజిస్ట్రార్లు



మహబూబ్‌నగర్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

- ఉన్న అధికారులు డిప్యుటేషన్‌పై హైదరాబాద్‌కు..
- ఖాళీ స్థానాలను ఇన్‌చార్జ్‌లతో భర్తీ చేస్తున్న వైనం
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇదీ పరిస్థితి

మెట్టుగడ్డ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో కొన్ని కార్యాలయాలు ఇన్‌చార్జ్‌లతో కొనసాగుతున్నాయి. ఇక్కడ విధులు నిర్వర్తించాల్సిన అధికారులు డిప్యుటేషన్ పేరుతో కావాల్సిన ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఖాళీ అయిన సీట్లను సీనియర్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలిస్తూ భర్తీ చేస్తున్నారు. ఉన్నతాధికారులతో ఉన్న సత్సంబంధాలతో వచ్చిన కొన్ని రోజులకే నచ్చిన చోటకు తిరిగి వెళ్లిపోతుండటం పరిపాటిగా మారింది.

- నాగర్‌కర్నూల్ కార్యాలయంలో పనిచేసే అధికారి డిప్యుటేషన్ పేరుతో పటాన్‌చెరువు కార్యాలయానికి వెళ్లిపోయారు. దీంతో జిల్లా రిజిస్ట్రార్(ఏబీ) కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.
- ఆత్మకూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వర్తించే అధికారి ముఖ్యమంత్రి ఓఎస్‌డీ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. మంత్రి జూపల్లి ప్రాతినిథ్యం వహిస్తున్న కొల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కుర్చీ ఖాళీగానే ఉండటంతో ఇన్‌చార్జ్‌తోనే నడిపిస్తున్నారు.

చిట్‌ఫండ్ అధికారి గండిపేటకు..

ఉమ్మడి జిల్లాలోని చిట్‌ఫండ్ సంస్థలను పర్యవేక్షించే అసిస్టెంట్ చిట్స్ రిజిస్ట్రార్ అధికారి సైతం వచ్చిన రెండు నెలల్లోనే గండిపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఇలా అధికారులు రావడం.. డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..



ఉమ్మడి జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేయాల్సిన అధికారులు డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే సీనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించాం. జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యాలయంలోనూ సిబ్బంది కొరత ఉంది. ఉన్నతాధికారులకు సమస్యలు విన్నవించాం. త్వరలోనే పరిష్కారం అవుతుంది. – వి.రవీందర్, జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ అధికారి

మొక్కజొన్నలో కత్తెర పురుగుతో నష్టం


మొక్కజొన్న పంట

రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి


సూక్ష్మధాతువు లోపం ఉన్న చీని ఆకులు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, జిల్లా వ్యవసాయాధికారి, జోగులాంబ గద్వాల

అలంపూర్: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉంది. కత్తెర పురుగుతో పంటకు నష్టం వాటిల్లుతుందని.. రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియా నాయక్ సూచించారు. అందుకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. యాసంగిలో పంట మొలక దశ నుంచి కొంత ఏపుగా పెరగడంతో ముందస్తు జాగ్రత్తలు పాటిస్తేనే ఆశించిన దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు.

- కత్తెర పురుగు ఆశించిన పంటకు ముందుగా వేప నూనె 1500 పీపీఎంలు, 5 లీటర్ల నీటిలో క్లోరిఫైరిఫాస్ 50 మి.లీ. కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. తర్వాత థయోమిథాక్సం 12.6 శాతం, లామ్డాసైహాలోత్రిన్ 9.5 శాతం, ఎస్‌సీ 0.5 మి.లీ. లేదా క్లోరాన్ ట్రనోలిపోల్ 18.5 శాతం ఎస్‌సీ 0.4 మి.లీ. లేదా స్పైనోటోరం 11.7 శాతం, ఎస్‌సీ 0.5 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ మందులను మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలని వివరించారు. ఎకరాకు 8 చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకుని పురుగు ఉధృతి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

చీని తోటల్లో సూక్ష్మధాతువు లోపాలు..

చీని తోటల్లో వేరు కుళ్లు, సూక్ష్మధాతువు లోపాలను గుర్తించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచించారు. చీని పంటలో వేరుకుళ్లు తెగులు ఆశించడానికి అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ తెగుళ్లు ఆశించిన మొక్కల వేర్లు మొదట నల్లగా మారతాయి. ఆ తర్వాత చెట్లు ఒకదాని తర్వాత ఒకటి చనిపోతాయని వివరించారు.

నివారణ: ఈ తెగులు నివారణకు బానిస్టన్ 1 గ్రాము లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో ద్రావణాన్ని పోయాలి. ఈ పద్ధతి ఒకటి నుంచి రెండు సార్లు 15 రోజులపాటు పాటించాలి. చీని తోటల్లో సూక్ష్మ ధాతువు లోపాలతో ఆకుల మధ్య ఈనెలు పసుపు పచ్చ రంగుగా మారి తర్వాత ఆకులు రాలిపోతాయి. దీన్ని నివారణకు పార్ములేషన్ 4 లేదా 6 గ్రాములు లీటరు నీటిలో కలిపి ఆకుల మీద పడే విధంగా పిచికారీ చేసుకోవాలని సూచించారు. చీని తోటలో వేరు కుళ్లు తెగులు నివారణకు ట్రైకోడర్మా విరిడి 5 కిలోలు, 50 కిలో పేడలో వేసుకొని వారం రోజుల తర్వాత మొక్క మొదల్లో వేసుకోవాలని వివరించారు. దీంతోట్రైకోడర్మా విరిడి వేరు కుళ్లు కలగజేసే శిలీంధ్రాన్ని ఆశించి వేరుకుళ్లు రాకుండా కాపాడుతుంది.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

కామాంధుడిని పట్టుకొని దేహశుద్ధి చేసిన స్థానికులు

మహబూబ్‌నగర్ క్రైం: అభం..శుభం తెలియని చిన్నారిపై ఓ కామాంధుడు అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. అదే సమయానికి తల్లి చిన్నారిని వెతుకుంటూ వెళ్లడంతో ఆ కీచకుడి నుంచి కాపాడగలిగింది. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన 50 ఏళ్ల ఖాజా అనే వ్యక్తి చికెన్ సెంటర్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. శనివారం ఖాజా పక్కింట్లో ఉండే నాలుగేళ్ల చిన్నారిని తన ఇంట్లోకి తీసుకువెళ్లి అత్యాచారం చేయడానికి దుస్తులు తొలగించాడు. అదే సమయంలో తల్లి.. తన కూతురు కనిపించడం లేదని వెతుక్కుంటూ ఖాజా ఇంట్లోకి వెళ్లింది. అక్కడ జరుగుతున్న దారుణాన్ని చూసి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి అతడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. పోలీసులు అక్కడి నుంచి పారిపోయాడు. ఖాజాపై పోక్సోతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఇద్దరిపై కేసు నమోదు

కోడేరు: మండలంలోని కొండ్రావుపల్లికి చెందిన శ్రీనివాస్‌రావు పొలంలో అర్జున్‌రావు గేదెలు మేస్తుండగా ఇద్దరి మధ్య మాటమాట పెరిగి వాగ్వివాదం చోటు చేసుకుంది. కోపోద్రిక్తుడైన అర్జున్‌రావు, కుమారుడు బాబురావు ఇంటికి వెళ్లి శ్రీనివాస్‌రావు, ఆయన భార్య వనజపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. వారు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోకారి తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు

- యువతి దుర్మరణం
- మరో ఆరుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన కారు


నవ్యశ్రీ (ఫైల్)

ఉండవెల్లి: బెంగళూరు నుంచి ప్రయాగ్‌రాజ్ (కుంభమేళా)కు వెళ్తున్న ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఓ యువతి దుర్మరణం చెందగా.. ఆరుగురు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. బెంగళూరులోని రామనగర్‌కు చెందిన నవ్యశ్రీ (18), ప్రతిభ, రేణుక, శోభ, శివప్రసాద్, రాజన్న, మంజునాథ్, డ్రైవర్ బస్వరాజు కారులో శుక్రవారం కుంభమేళాకు బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడు శివారుకు చేరుకున్న వీరి కారుకు కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో నవ్యశ్రీ, ప్రతిభ, బస్వరాజు, రేణుకకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా.. నవ్యశ్రీ మృతిచెందింది. శోభ, శివప్రసాద్, రాజన్నకు స్వల్పగాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు మంజునాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

అధిక సంఖ్యలో కేసులు రాజీ కావాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి బి.పాపిరెడ్డి

పాలమూరు: మార్చి 8న జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు అధిక సంఖ్యలో పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కోర్టులోని ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లో లెక్టర్ విజయేందిర, ఎస్పీ డి.జానకిలతో న్యాయమూర్తి ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా లోక్ అదాలత్‌లో రాజీ అయ్యే కేసులపై సమీక్షించి వివరాలు సేకరించారు. కక్షిదారులు లోక్ అదాలత్‌కు అధికంగా హాజరయ్యే విధంగా పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. వీటితో పాటు రోడ్డు ప్రమాదాల కేసుల అధికంగా పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. టీజీఆర్టీసీ, ఇన్సూరెన్స్, బ్యాంకులు ఇలా అన్ని రకాల కేసులలో కక్షిదారులు లోక్ అదాలత్‌కు వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీతో పోలీస్ స్టేషన్ వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులపై చర్చించారు. అనంతరం న్యాయమూర్తి ఆర్టీసీ, ఇన్సూరెన్స్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తులు కల్యాణ్ చక్రవర్తి, శారదా దేవి, ఇందిర, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఎక్సైజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కేటీఆర్ ఎప్పుడు జైలుకు పోతాడో చిలక జోస్యం చెప్ప

- మాజీ మంత్రి ఎర్రబెల్లి వ్యాఖ్యలపై విప్ ఆది శ్రీనివాస్ ఫైర్



సాక్షి, హైదరాబాద్: నలభై ఏళ్ల రాజకీయ చరిత్ర అని గొప్పలు చెప్పుకునే బీఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు చిన్న అమ్మాయి చేతిలో చిత్తుచిత్తుగా ఓడిపోయినా సిగ్గు రాలేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత ఆయన చిలకజోస్యం చెప్పుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుందంటూ ఎర్రబెల్లి చెప్పిన మాటలు చిలుక జోస్యం లాగానే ఉన్నాయని, ఆయనకు నిజంగా జ్యోతిషం తెలిస్తే ఫామ్‌హౌస్‌లో పడుకున్న కేసీఆర్ ఎప్పుడు లేస్తాడో, ఫార్ములా ఈ–రేసులో కేటీఆర్ ఎప్పుడు అరెస్టు అవుతాడో చెప్పాలని శ్రీనివాస్ హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల గురించి ఆలోచించాల్సిన అవసరం ఎర్రబెల్లికి లేదని, ఇప్పటికే ఆ పార్టీ నుంచి 10 మంది వెళ్లిపోగా మిగిలిన వారిని కాపాడుకోవాలని సూచించారు. సీఎం వ్యాఖ్యలను బండి సంజయ్ వక్రీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా 18, 19 తేదీల్లో నిరసన

- 9 వామపక్ష పార్టీల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రజల మౌలిక అవసరాలకు కేటాయింపులు తగ్గించి, సంపన్నులకు రాయితీలు పెంచడం ద్వారా సామాన్యులకు తీరని ద్రోహం చేసిందని తొమ్మిది వామపక్ష పార్టీలు విమర్శించాయి. ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ అఖిలభారత వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా ఈ నెల 18, 19 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు వామపక్ష పార్టీల నేతలు జాన్ వెస్లీ (సీపీఎం), కూనంనేని సాంబశివరావు (సీపీఐ), పోటు రంగారావు (సీపీఎం–ఎంఎల్) మాస్‌లైన్, గాదగోని రవి (ఎంసీపీఐ–యూ), సాదినేని వెంకటేశ్వర్‌రావు (సీపీఐ–ఎంఎల్ న్యూ డెమోక్రసీ), జానకిరాములు (రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ), సీహెచ్ మురహరి (ఎస్‌యూసీఐ–సీ), రమేశ్ రాజా (సీపీఐ–ఎంఎల్ లిబరేషన్), బి.సురేందర్ రెడ్డి (ఫార్వర్డ్ బ్లాక్) శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు హామీ కల్పించి, బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐని ఉపసంహరించాలనే పలు డిమాండ్లతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నాలన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మన్ననూర్: ప్రకృతి మార్గదర్శి (నేచర్ గైడ్)పైన ఆసక్తి కలిగిన ఆదివాసీ చెంచు యువత నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయ సిబ్బంది శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మన్ననూర్ ఐటీడీఏ పరిధిలోని కొల్లాపూర్, లింగాల, బల్మూర్, అచ్చంపేట, పదర, అమ్రాబాద్ మండలాలకు చెందిన చెంచు యువతీ, యువకులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు. పదో తరగతి పాస్/ ఫెయిల్ అయిన అభ్యర్థుల నుంచి ఎంపిక చేసిన వారికి బెంగుళూరులో 3 నెలల పాటు నేచర్ గైడ్ శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. నల్లమలలో ఎకో టూరిజం అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణతోపాటు బాధ్యతాయుత పర్యాటక విధానాలను మెరుగుపరచడం దీని ఉద్దేశం అన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన యువతీ, యువకులు ఈ నెల 22లోగా ఐటీడీఏ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాదేపల్లి యార్డులో తూకాల లొల్లి

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం హమాలీలు, ఖరీదుదారుల మధ్య తూకాల లొల్లి చోటు చేసుకుంది. వేరుశనగకు సంబంధించి ఖరీదుదారులు 35 కిలోల బస్తాగా తూకం వేయాలని కోరుతుండగా హమాలీలు 30 కిలోల బస్తాగా తూకం వేస్తామని పేర్కొనడంతో విభేదాలు తలెత్తాయి. ఈ ఏడాది వేరుశనగ దిగుబడులు అంత నాణ్యతగా రాకపోవడంతో 30 కిలోలకే బస్తా నిండుతుందని హమాలీలు పేర్కొంటున్నారు. గతేడాది నాణ్యతగా వేరుశనగ దిగుబడులు ఉండడంతో 35 కిలోలు బస్తా తూకం వేశామని, ఈ సీజన్‌లో ఆ పరిస్థితి లేకపోయిందని తెలిపారు. అంతేగాక ఖరీదుదారులు తమకు అందజేస్తున్న ఖాళీ బస్తాలు కూడా అంత నాణ్యతగా లేకపోవడంతో 30 కిలోల వరకే బస్తా నిండిపోతుందని, బస్తాలను కుట్టు వేసేందుకు కూడా ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. అయితే ఈ వివాదం కారణంగా కొందరు ఖరీదుదారులు ధరలను తక్కువగా కేటాయించే అవకాశాలు ఉన్నాయన్న ఆరోపణలు వచ్చాయి. ఒకరిద్దరు వ్యాపారులు మాత్రమే ఈ విధంగా ఇబ్బందులు సృష్టిస్తున్నట్లు హమాలీలు చెప్పారు. కాగా 30 కిలోల బస్తాలను తూకం వేస్తే హమాలీల చార్జీలు కూడా రైతులపై భారం పడే అవకాశం ఉంటుందని దీనిపై మార్కెట్ యార్డు అధికారులు, పాలక మండలి విచారించి చర్యలు తీసుకోవాలని అటు హమాలీలు, ఇటు ఖరీదుదారులు కోరుతున్నారు.

భయపెడుతున్న జీబీ సిండ్రోమ్



బాధితుల్లో కాళ్ల నుంచి మెడ దాకా క్రమంగా అచేతనం ● పరిశుభ్రమైన నీరు, ఆహారమే ముందు జాగ్రత్తలు

సాక్షి ఫ్యామిలీ హెల్త్ డెస్క్

గులియన్ బ్యారి సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి వేగంగా విస్తరిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ వ్యాధి లక్షణాలేమిటి? దీని బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలను ప్రజలు శోధిస్తున్నారు. కలుషిత నీరు, ఆహారం తీసుకునే వారిలోనే జీబీఎస్ అధికంగా వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెప్తున్నారు.

జీబీ సిండ్రోమ్ లక్షణాలు

- ఏదైనా వైరల్ లేదా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ సోకిన తర్వాత పోస్ట్ వైరల్ లేదా పోస్ట్ బ్యాక్టీరియల్ వ్యాధిగా కనిపించేదే జీబీఎస్.
- మెదడు నుంచి దేహంలోని ప్రతి భాగానికి ఆదేశాలందించడానికి నరాలపై మైలీన్ అనే పొర ఉంటుంది. యాంటీబాడీస్ ఈ పొరను దెబ్బతీసినప్పుడు మెదడు నుంచి సిగ్నల్స్ అందక అవయవాలు అచేతనమవుతాయి.
- మొదట కాళ్లు చచ్చుబడిపోతాయి. క్రమంగా దేహమంతా అచేతనమవుతుంది. గొంతు కండరాలు అచేతనమైతే రోగి మాట్లాడలేడు. మింగడమూ కష్టమవుతుంది. ముఖంలోని కండరాలు అచేతనమైతే కళ్లు కూడా మూయలేడు.
- ఈ ప్రక్రియ ఛాతీ కండరాలు, ఊపిరితిత్తులను పని చేయించే డయాఫ్రమ్ కండరాల వరకు వెళ్లినప్పుడు ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. ఆ స్థితికి వచ్చిన బాధితులు మృతి చెందే అవకాశం ఉంది.
- గుండె స్పందనలు వేగంగా లేదా మెల్లగా మారడం, బీపీ హెచ్చు తగ్గులకు గురికావడం, ముఖం నుంచి వేడి ఆవిర్లు వస్తున్నట్లు అనిపించడం, బాగా చెమటలు పట్టడం జరగవచ్చు. వ్యాధి మొదలయ్యాక 7 నుంచి 14 రోజులపాటు తీవ్రం వస్తుంది. మైలీన్ పొర మళ్లీ యథాస్థితికి వస్తే బాధితులు క్రమంగా కోలుకుంటారు. ఆ ప్రక్రియ రోజుల వ్యవధి నుంచి ఆరు నెలలలోగా జరగవచ్చు.
- శరీరంలో పొటాషియం లేదా కాల్షియం పాళ్లు తగ్గినా జీబీఎస్ లక్షణాలే కనిపిస్తాయి. అయితే అవి భర్తీ కాగానే అచేతనత్వం తగ్గిపోతుంది. కాబట్టి జీబీ సిండ్రోమ్ నిర్ధారణ చాలా స్పష్టంగా జరగాలి.
- కలుషిత నీరు, ఆహారమే జీబీఎస్ రావటానికి ప్రధాన కారణమని గుర్తించారు.

తక్కువ ఖర్చుతో చికిత్స

ఈ జబ్బులో రోగి తన రోజువారీ పనులను సొంతంగా చేసుకోలేని పరిస్థితికి చేరుకుంటే వారికి తగిన మోతాదులో ఐదు రోజులపాటు ఇమ్యూనో గ్లోబ్యులిన్ ఇంజెక్షన్లు ఇస్తారు. ఇవి దేహంలో మైలీన్ పొరను ధ్వంసం చేసే యాంటీబాడీస్‌ను బ్లాక్ చేయడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దుతాయి. మరో పద్ధతిలో రోగి బరువును బట్టి ప్రతి కిలోగ్రాముకు 250 ఎంఎల్ ప్లాస్మాను రక్తం నుంచి తొలగిస్తారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కలుషితమైన నీరు, ఆహారం వాడకపోవడం మేలు.



-డాక్టర్ బి. చంద్ర శేఖర్‌రెడ్డి, సీనియర్ న్యూరో ఫిజిషియన్

'గురి' తప్పిన గురుకులాలు

▶ మొదటి పేజీ తరువాయి

చేపడుతోంది. మైనార్టీ సొసైటీలోని పాఠశాలలు మినహా మిగిలిన నాలుగు సొసైటీల్లోని 643 పాఠశాలల్లో ఐదోతరగతిలో 51,924 సీట్లు ఉన్నాయి. వీటిలో ఐదోతరగతి ప్రవేశాలకు గతేడాది డిసెంబర్ 21 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 80 వేలలోపే దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాదితో పోల్చితే ఇవి దాదాపు 40 వేలు తక్కువ. ఈ నెల 23వ తేదీన అర్హత పరీక్ష నిర్వహించేందుకు ఎస్సీ గురుకుల సొసైటీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం నమోదైన దరఖాస్తుల ప్రకారం ఒక్క సీటు కోసం సగటున 1.6 మంది పోటీ పడుతున్నారు. గురుకుల పాఠశాల ప్రవేశం కోసం గతంలో విపరీతమైన డిమాండ్ ఉండేది. ఒక్కో సీటు కోసం సగటున నలుగురు విద్యార్థులు పోటీపడేవారు. గత ఏడాది కాలంగా గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు భారీగా పెరగటమే డిమాండ్ తగ్గటానికి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సంవత్సరాలవారీగా దాదాపుగా సీట్లు, దరఖాస్తులు

సంవత్సరం	మొత్తం సీట్లు	దరఖాస్తులు
2020–21	48,000	1,68,000
2022–23	48,000	1,50,000
2023–24	48,000	1,32,000
2024–25	51,000	1,20,000
2025–26	51,000	80,000

సొసైటీల వారీగా పాఠశాలలు, ఐదో తరగతిలో సీట్లు ఇలా..

సొసైటీ	స్కూళ్లు	సీట్లు
ఎస్సీ	232	18,560
ఎస్టీ	82	6,560
బీసీ	294	23,680
జనరల్	35	3,124
మొత్తం	643	51,924

సీపీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి గిరిజన ఉపాధ్యాయ సంఘం మద్దతు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ బలపరిచిన అభ్యర్థి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డికి తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు అభ్యర్థి ఇన్నారెడ్డి, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌లను.. శనివారం తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ రాథోడ్ తదితరులు కలిసి మద్దతు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, ఓపీఎస్ సాధనే లక్ష్యంగా ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో సీపీఎస్ అభ్యర్థి విజయం సాధించడం ద్వారా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లవచ్చని అభిప్రాయపడ్డారు.

బడ్జెట్ కసరత్తు ముమ్మరం

- ఇప్పటికే ప్రభుత్వానికి చేరిన అన్ని శాఖల అంచనాలు
- శాఖల వారీగా సమీక్షలు జరుపుతున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్ రూపకల్పన కసరత్తును రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన నిధులను అన్ని ప్రభుత్వ శాఖలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఆర్థిక శాఖకు పంపాయి. ఈ ప్రతిపాదనలపై ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో బడ్జెట్ తయారీ కోసం శాఖల వారీగా సమీక్షలు జరుగుతున్నాయి. ఇప్పటికే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, ఆర్ అండ్ బీ, బీసీ సంక్షేమం, రవాణా, వ్యవసాయం, జౌళి శాఖలపై సమీక్షలు పూర్తికాగా, శనివారం రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై భట్టి విక్రమార్క.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. బడ్జెట్ రూపకల్పన, ప్రభుత్వ ప్రాధాన్యతల గురించి మంత్రులు అధికారులకు దిశానిర్దేశం చేశారు. మిగిలిన శాఖల అంచనాలపై కూడా వచ్చే వారం నాటికి సమీక్షలు పూర్తవుతాయని, అనంతరం బడ్జెట్ తయారీలో ఆర్థిక శాఖ పూర్తిస్థాయిలో నిమగ్నమవుతుందని తెలుస్తోంది. మార్చి మొదటి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించిన ప్రభుత్వం ఆ సమావేశాల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. కాగా, ఈసారి బడ్జెట్ పరిమాణం పెరుగుతుందా, తగ్గుతుందా అన్న దానిపై ఆర్థిక శాఖ వర్గాలు తర్జనభర్జనలు పడుతున్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన సాయం విషయంలో ఆశించిన మేర నిధులు రాకపోవడం, ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో సొంత ఆదాయ రాబడులపైనే దృష్టి సారించి బడ్జెట్‌ను రూపొందించాల్సి ఉంటుందని, బడ్జెట్ పరిమాణంపై రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనను బట్టి నిర్ణయం తీసుకుంటామని ఆర్థిక శాఖ వర్గాలు చెప్పాయి.

ఆ జిల్లాల్లో ఇందిరమ్మ నిర్మాణాలు

▶ మొదటి పేజీ తరువాయి

రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్, సమాచార శాఖ కమిషనర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

భూములపై నిరంతర పర్యవేక్షణ

రెవెన్యూ శాఖ సమీక్షలో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ ప్రభుత్వ భూములపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. కోట్ల రూపాయల విలువైన భూములు ప్రభుత్వం చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కోర్టు కేసుల్లో ఉన్న భూములను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని కోరారు. సినిమా రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు సమాజ వికాసానికి దోహదపడే విధంగా లఘుచిత్రాలను తీసుకువచ్చేందుకు నిధులు కేటాయిస్తామని చెప్పారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ల చుట్టూ పేద, మధ్య తరగతి ప్రజల కోసం శాటిలైట్ టౌన్‌షిప్ నిర్మాణాలపై హౌజింగ్ శాఖ దృష్టి సారించాలన్నారు. హైదరాబాద్‌లోని మధ్య తరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసేందుకు ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ ఇళ్ల నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించి, రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపడం ద్వారా భూసేకరణ చేసుకోవాలని సూచించారు. ఇక, రాష్ట్రంలో భూముల డిజిటల్ సర్వేకు సంబంధించి అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాల జాబితాను సేకరించాలని, ప్రతి నెలా ఈ అద్దెలను చెల్లించేలా ఆర్థిక శాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహకాల్లో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ విద్యుత్ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

'స్థానిక' పోరులో కాంగ్రెస్ మిత్రపక్షాలతో కలవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సాక్షి, హైదరాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మిత్రపక్షాలతో పరస్పర అవగాహన విషయంలో కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని చాటుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నా రు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, శత్రువును ఎదుర్కొనేందుకు కలసి పనిచేయాల్సిన అవసరాన్ని మొన్నటి ఢిల్లీ ఎన్నికలు నిరూపించాయన్నారు. కాంగ్రెస్, ఆప్ పార్టీల స్వయంకృతాపరాధం వల్లనే ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను స్థానిక సంస్థల ఎన్నికల నాటికి అమలు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అవసరమైతే అప్పులు చేసైనా.. ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఉచితాల కారణంగా వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదని, ఇతర పనులకు కూడా ఎవ్వరూ రావడం లేదని మేధావులు, న్యాయమూర్తులు వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులనే సంక్షేమ పథకాల రూపంలో తిరిగి వారికి ఇస్తున్నారు తప్ప ఉచితంగా కాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణనను దేశవ్యాప్తంగా చేపట్టాలన్నారు.

మన్యంకొండ గిరులు కిటకిట

భారీగా తరలివచ్చిన భక్తులు



శేషవాహనంపై స్వామివారు (ఇన్‌సెట్‌లో) ఉత్సవమూర్తులు



మన్యంకొండలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం శనివారం భక్తజన సంద్రంగా మారింది. బ్రహ్మోత్సవాలు శుక్రవారమే ముగిసినప్పటికీ జాతర మాత్రం నెల రోజుల పాటు కొనసాగనుంది. శనివారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ముందుగా కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోగా.. మరికొందరు తలనీలాలు సమర్పించారు. ఉదయమే కోనేరు నుంచి గర్భగుడి వరకు దర్శనానికి భక్తులు బారులు తీరారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం పక్కనున్న శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తండోపతండాలుగా తరలిరావడంతో దిగువకొండ, తేరు మైదానం, కోనేరు ప్రాంతం కిటకిటలాడింది.

వైభవంగా శేషవాహనసేవ..

మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి శేషవాహన సేవ ఘనంగా నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన శేషవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గర్భగుడి నుంచి రథాల మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రోచ్చారణలు, కాగడాల వెలుతురు నడుమ శేషవాహనం ముందుకు కదిలింది. భక్తుల హరినామ స్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. బంగారు ఆభరణాలు, రకరకాల పూల అలంకరణలో స్వామి, అమ్మవార్లు భక్తకోటికి దర్శనమిచ్చారు. రథాల మండపం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి తిరిగి శేషవాహనంలో గర్భగుడిలోకి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటిండెంట్ నిత్యానందాచారి, పాలకమండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు



స్వామివారికి దాసంగాలు పెడుతున్న భక్తులు

పాలమూరు వాసికి ఏషియన్ స్పోర్ట్స్ లీడర్‌షిప్ అవార్డు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిట్‌నెస్ స్పోర్ట్స్ సైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ధర్మాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ ఏషియన్ స్పోర్ట్స్ లీడర్ అవార్డు అందుకున్నారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ప్రొఫెసర్లు లక్ష్మీకాంత్‌రాథోడ్, బి.సునీల్‌కుమార్ చేతుల మీదుగా చంద్రశేఖర్‌గౌడ్ ప్రశంసాపత్రం అందుకున్నారు. చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఈ అవార్డు అందుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అథ్లెటిక్స్‌లో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నానని, మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సేవలు అందించినందుకు అవార్డు వచ్చినట్లు తెలిపారు.



మంత్రి చేతులమీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్

తెలుగు జాతి సంస్కృతిని కాపాడుకుందాం

- రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్
- మన్యంకొండలో ప్రారంభమైన పద్య నాటక ప్రదర్శనలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలుగు జాతి సంస్కృతిలో భాగమైన నాటకరంగాన్ని కాపాడుకుందామని రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్ అన్నారు. మన్యంకొండ శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవాలయం ప్రాంగణంలో శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో పౌరాణిక పద్యనాటక ప్రదర్శనలు శనివారం రాత్రి వైభవంగాప్రారంభమయ్యాయి. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి పద్య నాటక ప్రదర్శనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాద్మి శివకుమార్ మాట్లాడుతూ నాటక కళారంగాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. శ్రీమిత్ర కళా నాట్యమండలి ఆధ్వర్యంలో పద్యనాటక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ మాట్లాడుతూ పదేళ్ల నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో మన్యంకొండ క్షేత్రంలో పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18వతేదీ వరకు పద్యనాటక ప్రదర్శనలు ఉంటాయని, భక్తులు తిలకించాలని కోరారు. నాటక ఉత్సవాల తొలి రోజు నాట్యం అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులు శాస్త్రీయ నృత్యం ప్రదర్శనలు ఇచ్చారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న బాద్మి శివకుమార్ తదితరులు

అదేవిధంగా మయసభ దుర్యోధన, రామాయణయుద్ధ ఘట్టం, శ్రీకృష్ణ రాయబారం పూర్తి నాటకాన్ని ప్రదర్శించారు. నాటకాల ప్రదర్శనలో పాత్రధారులు తమ అభినయంతో అలరించారు. కార్యక్రమంలో దేవాలయ ఈఓ శ్రీనివాసరాజు, పాలక మండలి సభ్యులు వనజ, వెంకటాచారి, ఆంజనేయులు, మంజుల, అలివేల మంగమ్మ, శ్రవణ్‌కుమార్, గోవిందు, కళాకారులు వీపీరాంరెడ్డి, పాండురంగాచారి, దామోదర్, గాల్‌రెడ్డి, నర్సింలు, రాజు, మాధవరాజు, ద్రోణాచారి, పురుషోత్తంచారి, కృష్ణమూర్తి, ప్రభాకరాచారి, మాసయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



శాస్త్రీయ నృత్య ప్రదర్శన

18న బీసీ సమాజ్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఈనెల 18న జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ కులసంఘ నాయకులు, మేధావులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘం ప్రతినిధులతో బీసీ సమగ్ర కులగణన నివేదికపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాస్‌సాగర్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని బీసీ సమాజ్ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు సంగెం సూర్యారావు హాజరవుతారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రధాన హామీ అయినా కులగణనను అసమగ్రంగా చేసి బీసీల జనాభాను తక్కువ చేసి చూయించి అగ్రవర్ణాల జనాభాను ఎక్కువ, ముస్లింలను బీసీ ముస్లింలుగా చూయించిన విషయంపై చర్చించుకుంటామని అన్నారు. బీసీల జనాభా 19 లక్షలు తక్కువ చేయించి చూపించిన దానిపై, చాలా ఇళ్లలో సర్వే నిర్వహించని వైనంపై ప్రధానంగా ఈ సమావేశంలో చర్చించుకొని భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సారంగి లక్ష్మీకాంత్, ఆయా సంఘాల ప్రతినిధులు బుగ్గన్న, రవి ముదిరాజ్, జి.సత్యనారాయణ సాగర్, ఆంజనేయులు, విశ్వనాథ్, తిరుపతయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌సాగర్ తదితరులు